

విద్యార్థులపై దాడి అమానుషం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-నెల్లూరు :విక్రమ సింహపురి యూనివర్సిటీలో, క్రిస్టస్ వేడుకలు జరుపుకుంటున్న విద్యార్థులపై మతోన్మాద ఎబివిపి గుండాల దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలని, పోలీసు అధికారులు ఎబివిపి నాయకుడు రాజశేఖర్ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం స్థానిక రామచంద్ర రెడ్డి భవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ విక్రమ సింహపురి యూనివర్సిటీలో విద్యార్థులు కులమత భేదాలు లేకుండా సెమీ క్రిస్టస్ వేడుకలు జరుపుకుంటే ఎబివిపి వెళ్లి మారణాయుధాలతో దాడులు చేయడం దారుణమన్నారు. ఈ చర్యలను ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. ఈ దాడికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీహర్ష ,సిటీ కార్యదర్శి నరేంద్ర ,రూరల్ కార్యదర్శి సంతోష్ ,జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ, సంగం మండల కార్యదర్శి పవన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అంగన్‌వాడీల సమ్మెపై ప్రభుత్వం మీనమేషాలు

సమస్యలు పరిష్కరించకుండా నిర్బంధ ప్రయోగం- నిరసనను భగ్నం చేసేందుకు యత్నం

ఉలవపాడులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-ఉలవపాడు :గత తొమ్మిది రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలను ప్రభుత్వం పట్టించుకోకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, సమ్మెపై దుష్ప్రచారం చేయడాన్ని నిరసిస్తూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఉలవపాడు ఐసిడిఎస్ ఆఫీస్ వద్ద లింగసముద్రం, ఉలవపాడు, గుడ్లూరు మండలాలకు చెందిన అంగనవాడి వర్కర్లు, హెల్పర్లు నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు జివిబి కుమార్, వాకా. లతా రెడ్డి, ప్రభావతి మాట్లాడారు. సమ్మెపై ప్రభుత్వం దుష్ప్రచారం చేయటాన్ని ఖండించారు. ప్రభుత్వం అనాగరికంగా అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగల గొట్టటం సిగ్గుచేటన్నారు. మహిళలకు అన్యాయం చేసిన ఏ ప్రభుత్వానికైనా తగిన శాస్తి జరుగు తుందన్నారు. పట్టుదలకు పోకుండా, ప్రభుత్వం దిగివచ్చి అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అనంతరం ఉలవపాడు మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ బొమ్మ సెంటర్ లో మానవహారం నిర్వహించారు. సిఐటియు ఉలవపాడు మండల అధ్యక్షురాలు వాకాలాతారెడ్డి.ఉలవపాడు ప్రాజెక్టు లీడర్ సిహెచ్ ఇందిరావతి, అన్ని మండలాల నాయకులు ఎస్ కే పద్మజ, బీ మార్తమ్మ,కత్తి. బుజ్జమ్మ,మంచాలి సిహెచ్ పద్మజ, ఎం పద్మ, సిహెచ్ రమాదేవి, కాకర్లపూడి శైలజ, డి వరలక్ష్మి, డి రమాదేవి, సురేఖ, ప్రసన్న ఉన్నారు.

నెల్లూరు :అంగన్‌వాడీలందరికీ కనీస వేతనంగా రూ.26 వేలు, గ్రాడ్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. నగరంలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారం నాటికి 9వ రోజుకు చేరింది. అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె కార్యక్రమంలో ఎన్‌జిఒ రాష్ట్ర నాయకులు శరత్‌బాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం రూరల్ అధ్యక్షులు ఎస్‌కె ఖలీల్ పాల్గొన్ని తమ సంఘీభావం తెలిపారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపక్ష హోదాలో ఉన్న వైసిపి 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర అధికారాన్ని చేజిక్కించుకోవలన్న ఒక్క ఆలోచనతో అంగన్ వాడీలందరూ తమ అక్క,చెల్లెల్లుని, తమ పార్టీ తరపున పోటీలో నిలిచిన అభ్యర్థులకు ఓట్లేసి గెలి పించాలని కోరారన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే అంగన్‌వాడీల సమస్యలను పరిష్క రిస్తామంటూ మాట ఇచ్చి ఆ తర్వాత వదిల ేశారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కొత్తగా ఏమీ అడగటం లేదని, ప్రస్తుత ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష హోదాలో ఉన్న సమయంలో చేసిన హామీలను అమలు చేయాలని కోరుతున్నారన్నారు.

నెల్లూరులోని కిసాన్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

అధికారులను అడ్డుకున్న అంగన్‌వాడీలు

నగరంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేస్తుంటే జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కిసాన్ నగర్ సెంటర్ లో అంగన్‌వాడీ సెంటర్ తాళాలు పగలుకొట్టేందుకు వచ్చిన సచివాలయం, ఐసిడిఎస్ అధికారులు చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న అంగన్‌వాడీ మహిళలు, లబ్ధిదారులు స్థానికులు అడ్డుకున్నారు. అంబాపురం సెక్టార్, కొండాయపాళెం సెంటర్ సెక్టార్, గాంధీనగర్, వెంగళరావునగర్ సెక్టార్,రూరల్ మండల పరిధిలో సౌత్‌మోపూరు సెక్టార్, కాకుపల్లి సెక్టార్ అధికారులు పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టేందుకు ప్రయత్నం చేశారు. నెల్లూరులోని కిసాన్‌నగర్‌లోని అంగన్‌వాడీ సెంటర్ వద్ద సిఐటియు నాయకులు కత్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టడాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

కందుకూరు :అంగన్‌వాడీలు సమ్మెలో భాగంగా కందుకూరు ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నుంచి ఎల్ఐసి కార్యాలయం వరకు బుధవారం భిక్షాటన చేశారు. ప్రజల నుంచి అంగన్‌వాడీలకు మంచి సానుభూతి లభించింది. అంగన్‌వాడలకు రూ. 14 485 ప్రజలు అందజేశారు. కందుకూరు సిఐటియు నాయకులు ఎస్ఎ గౌస్, కందుకూరు అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు కె రాజేశ్వరి, ఎస్.కె రహమతున్నీస, ప్రభావతి, ఎస్ సరస్వతి , ఎస్ కే శంషాద్, ఏ అనురాధ, శశి , జ్యోతి, సిహెచ్ ఉమామహేశ్వరి, కె అరుణ ఉన్నారు.

కందుకూరులో..

దీక్షల చేస్తున్న దృశ్యం

సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు : సర్వశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న వివిధ కేటగిరీలకు సంబంధించిన కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి. ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని జిల్లా విద్యా శాఖ కార్యాలయం ఎదుట ఎపి సర్వ శిక్షా అభియాన్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె ప్రారంభించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.వి ప్రసాద్ మాట్లాడుతూ ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం వీరందరినీ పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమానవేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, వీరికి రిటైర్మెంట్ కాలాన్ని 60 ఏళ్ల వరకు వయోపరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా సర్వ శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నారని, ఈ సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. గతంలో పాదయాత్రలు చేస్తున్న సమయంలో వీరందరికీ మినిమం టైం స్కేల్ అమలు చేస్తామని హామీ ఇచ్చారని, దానిని నేటి వరకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. పలు దపాలుగా ఈ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని మంత్రులకు, జిల్లా అధికారులకు, ప్రభుత్వ ప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం శూన్యమన్నారు. వీరందరికీ మెడికల్ లీవు అవకాశం కల్పించాలన్నారు. అవసరమైతే సిఐటియు ప్రత్యేక్షంగా పోరాటంలో నిలుస్తుందన్నారు. సర్వ శిక్ష అభియాన్ లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల నిరదిక సమ్మె శిబిరాన్ని బిటిఎ ఉపాధ్యాయ సంఘం నాయకులు కలిసి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. యూనియన్ నాయకులు రామారావు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -పొదలకూరు

పొదలకూరు చరిత్రలో కనీవిని ఎరుగని విధంగా 2019 నుంచి ఇప్పటివరకు తన హయాంలో రూ 37 కోట్ల విలువైన అభివద్ధి పనులు చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం పట్టణంలో పలుఅభివద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొ న్నారు. పొదలకూరులో రూ. 30 లక్షలతో సిమెంట్ రోడ్లు, రూ 80 లక్షల తో 33/11 కెవి విద్యుత్ లైన్ మార్పు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం నూతన ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని సంపూర్ణంగా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిల జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. తొలుత పొదలకూరు సెంటర్లో ఏర్పాటు చేస్తున్న తన తండ్రి విగ్రహాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం పొదలకూరులో చేపట్టిన అభివద్ధి కార్యక్రమాలపై ప్లకార్డులతో నిర్వహించిన మోటార్ బైక్ ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. పొదలకూరు జెడ్‌పిటిసి తెనాలి నిర్మలమ్మ, వైసిపి నాయకులు కె. చిన్న బ్రహ్మయ్య, జి గోపాల్ రెడ్డి, మద్దిరెడ్డి రమణారెడ్డి, సోమా భాస్కర్, చంద్రశేఖర్ రెడ్డి ,వాకాటి శ్రీనివాసులు రెడ్డి ,ఎం. శేఖర్ ,ఎస్ కే .అంజాద్, భారతమ్మ ,విద్యుత్ శాఖ ఎస్ ఈ విజయన్, పొదలకూరు ఎంపీడీవో నగేష్ కుమారి, తహశీల్దార్ వీర వసంత కుమార్ ఉన్నారు.

శంకుస్థాపన చేస్తున్న మంత్రి కాకాణి

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

నగరపాలక సంస్థలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న మునిసిపల్ కార్మికుల ందరినీ తక్షణమే పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లా యీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం నగరంలోని ఎసి నగర్ సెంటర్‌లో 10, 11, 13,14,15 డిజన్లలోని కార్మికులు నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నగర నాయకులు పి సూర్యనారాయణ, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు ఆర్.ఎమ్. సునీల్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి గత అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో దళిత, గిరిజన బలహీన వర్గాలకు చెందిన మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని చెప్పారన్నారు. ఆ దిశగా చర్యలు చేప్పలేదన్నారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణి విడ నాడాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించనిపక్షంలో నెల 26 నుంచి మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు,నగర కార్యదర్శి ఎం. అశోక్, జిల్లా అధ్యక్షులు జి. కామాక్షమ్మ, ఐద్వా నగర కార్యదర్శి కత్తి పద్మ, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి బీపీ నరసింహ, నాయకులు భాగ్యమ్మ,లోకేష్,చిన్న, బాబు, దయామణి ఉన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులు

కేక్ కట్ చేస్తున్న దృశ్యం

కిమ్స్ ఆస్పత్రిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -నెల్లూరు :నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా శాంతాక్లాస్, వైద్య సిబ్బంది ద్వారా క్రిస్మస్ కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా గిరినాయుడు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ఆచరణీయమని పేర్కొన్నారు. ప్రతినిత్యం పని ఒత్తిడిలో ఉండే సూపర్ స్పెషలిస్టు, స్పెషలిస్టు డాక్టర్లు కోవిడ్ లాంటి అత్యవసర పరిస్థితుల్లో కూడా నిరసంతరం వైద్యసేవలందిస్తూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా కొంత పని ఒత్తిడి తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది, టెక్నిషియన్లు, అడ్మినిస్ట్రేటివ్ హౌస్ కీపింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన అందరికీ కిమ్స్ ఆస్పత్రి తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన డ్యాన్స్ పోటీలు, ఫన్నీ గేమ్స్ అందరినీ అలరించాయి.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-నెల్లూరు

సమస్యలు పరిష్కరించాలని తొమ్మిది రోజుల నుంచి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై నిర్బంధం ప్రయోగించి వారి ఆందోళనను భగ్నం చేసేందుక ప్రభుత్వం ప్రయత్నించడం శోచనీయమనిసిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలు తమ అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారం నాటికి 9 రోజులు పూర్తి చేసుకుందన్నారు. అనివార్యమైన పరిస్థితుల్లో అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెలోకి వెళ్లారన్నారు. వైసిపి ప్రతి పక్ష హోదాలో ఉన్న సమయంలోనూ, ఎన్నికల ప్రచారంలో అంగన్‌వాడీలకు చేసిన హామీలు అమలు చేయడం వల్ల వచ్చిన ప్రభుత్వానికి వచ్చిన నష్టం ఏమిటో చెప్పాలని రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల సమయంలో పలు దపాలుగా తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేసి కోరారన్నారు. అంగన్‌వాడీలు కోరిన కోర్కెలు ఏమీ కొత్తవి కాదని, ఎన్నికల సమయంలో వైసిపి నిర్వహించిన ప్రచార సభల్లో అంగన్‌వాడీలకు చేసిన హామీలు అమలు చేయమని కోరుతున్నారన్నారు. తెలంగాణా రాష్ట్రంలో అంగన్‌వాడీలకు అందజేస్తున్న వేతనం కంటే వెయ్యి రూపాయలు అదనంగా అందజేస్తామని ఆర్భాటంగా హామీలు చేశారన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. అంగన్‌వాడీలు తొమ్మిది రోజుల నుంచి నిరవధి సమ్మెలో ఉంటే వారిని చర్చలకు ఆహ్వానించి, సమస్యను పరిష్కరించాలన్న ఆలోచన ముఖ్యమంత్రి చేయకపోవడం దారుణమని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రెహానాబేగం పేర్కొన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు టి.వి.విప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల తో చర్చలు నిర్వహించి సమ్మెను విర మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సిఐటియు నాయకులు కె.పెంచలనరసింహులు, అల్లాడి గోపాల్ ఉన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

బ్రహ్మయ్యకు అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు :వైసిపి జిల్లా పంచాయతీ రాజ్ విభాగ జిల్లా ఉపాధ్యక్షులుగా కుమ్మర బ్రహ్మయ్య నియమితుల య్యారు. కుమ్మర బ్రహ్మయ్య కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి కతజ్ఞతలు తెలిపారు. బ్రహ్మయ్య ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వైసిపి నాయకులు బ్రహ్మయ్యను అభినందించారు. వైసిపి మండల అధ్యక్షులు గంగవరపు వెంకటరావు, మాజీ ఏఎంసి చైర్మన్ తోకల కొండయ్య, కోవూరు సర్పంచ్ ఆవుల మాధవరావు, అప్పన బోయిన రామయ్య, మర్లపాడు మాజీ సర్పంచ్ బుర్ర సుబ్బారావు ఉన్నారు.

ఎంఎల్ఎ మహీధర్ రెడ్డిని కలిసిన బ్రహ్మయ్య

వేరుశనగ రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-ఉలవపాడు :కందుకూరు కషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త్ డా.జి.ప్రసాద్ బాబు, ఉలవపాడు మండల వ్యవసాయ అధికారిని తిరుమల జ్యోతి ఆధ్వర్యంలో ఉలవపాడు మండలంలోని అలాగాయపాలెం వేరుశనగ రైతులకు, రైతు మహిళలకు వేరుశనగలో ఉత్తమ యాజమాన్య పద్ధతులపై బుధవారం శిక్షణా జరిగింది. ప్రసాద్ బాబు మాట్లాడుతూ వేరుశనగ పంటలో గౌచో 600యఫ్ఎస్ మందుతో కిలో విత్తనానికి 2 మి.లీ. 4 మి.లీ. నీటిలో కలుపుకొని విత్తనాలకు పట్టించి తర్వాత టెబుకోనజోల్ మందుని 1 గ్రాము తో విత్తనశుద్ధి చేసుకొని విత్తుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అశ్విని, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆర్‌బికె'లలో ఎరువుల నిల్వలు

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు సబ్ డివిజన్ పరిధిలోని ఆర్‌బికెలలో యూరియా ఎరువుల నిల్వలు సరిపడా ఉన్నాయని కందుకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు పి అనసూర్య ఓ ప్రకటనలో తెలిపారు. డిఎపి లభ్యత తక్కువగా ఉందన్నారు. కొంతమంది విఎఎలు కాంప్లెక్స్ ఎరువులు కావాలని అడిగి ఉన్నారన్నారు. దానికి సంబంధించి ఇండెంట్ మార్క్‌ఫెడ్ వారికి పంపించామన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి

ప్రజాశక్తి -కందుకూరు :విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయాల్సిన అవసర ముందని పలువురు పేర్కొన్నారు. కందుకూరులోని సంస్కతి స్కూల్లో ప్రయివేటు పాఠశాలల సమావేశం జరి గింది. ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కష్ణమూర్తి ఆధ్వర్యంలో ఇది జరిగింది. 15 పాఠశాలలు కరస్పా ండెంట్స్ హాజరయ్యారు. ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా అధ్యక్షుడు నేలనూతల శ్రీధర్ మాట్లాడారు. మనోహర్ రెడ్డి మెమోరియల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ జిల్లాలో మూడు స్థాయిల్లో జరుగుతుందన్నారు. జనవరి 10న పాఠశాల స్థాయిలో జనవరి 30న నియోజకవర్గస్థాయిలో, ఫిబ్రవరి 4 జిల్లా స్థాయిలో జరుగుతుందన్నారు. ప్రయివేటు పాఠశాల సమస్యల గురించి చర్చించారు. జిల్లా ట్రెజరర్ కష్ణారావు జిల్లా సహా కార్యదర్శి హరిబాబు శంకర్ మాధవరావు తదితర కరస్పాండెంట్ మిత్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణమూర్తి

వైద్య పరికరాలపై జిఎస్‌టి ఎత్తివేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజల ఆరోగ్యపరిరక్షణకు అవసరమైన మందుల, వైద్య పరికరాల ధరలను ప్రభుత్వం నియంత్రించాలని, అదే సమయంలో ప్రస్తుతం విధిస్తున్న జిఎస్‌టిని ఎత్తివేయాలని ఎప మెడికల్ అండ్ సేల్స్‌రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా నగరంలో మెడికల్ రెప్రజెంటేటివ్స్ ఒక్క రోజు సమ్మెను నిర్వహించారు. ఈసందర్భంగా మెడికల్ రెప్రజెంటేటివ్స్ నగరంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపి మెడికల్ అండ్ సేల్స్‌రిప్రజెంటేటివ్స్ యూనియన్ జిల్లా కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నకిలీ, నాసిరకం మందుల అమ్మకాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మందులు, మందుల పరికరాలపై ప్రభుత్వం జిఎస్‌టి 18శాతం అమలు చేస్తుందని, దానిని వెంటనే తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం మందులు అందు బాటులోకి తీసుకురావాలని, నాణ్యమైన మందుల విక్రయానికి పటిష్టమైన చర్యలు తీసు కోవాలన్నారు. మెడికల్ రెప్రజెంటేటివ్స్ లకు ఉద్యోగ భద్రత కల్పించాలి, కనీస వేతనం రూ.25 వేలు అమలు చేయాలన్నారు. మెడికల్ రెప్రజెంటేటివ్స్‌ను యాజమాన్యాలు తీవ్రమైన మానసిక వత్తిడికి గురిచేయకుండా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కారణంగా అనేక మంది మెడికల్ రెప్రజెంటెటివ్స్ తీవ్రమైన మానసిక వత్తిడికి గురికావడం వల్ల చిన్న వయస్సులోనే గుండెపోటుకు గురై మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమ్మెలో అధ్యక్షులు మధు, కార్యదర్శి ఇర్ఫాన్, కోశాధికారి అమరనాద్ గుప్తా, ఉపాధ్యక్షులు మహేష్, జాయింట్ సెక్రటరీ సురేష్, పలువురు మెడికల్ రెప్రజెంటెటివ్స్ పాల్గొన్నారు.

వైసిపి సేవాదళ్ విభాగం జాయింట్ సెక్రటరీగా ఆదినారాయణరెడ్డి

ప్రజాశక్తి లింగసముద్రం : జిల్లా వైసిపి సేవాదళ్ విభాగం జాయింట్ సెక్రటరీగా లింగసముద్రం గ్రామనికి చెందిన ఉండేలా ఆదినారాయణరెడ్డిని నియమించారు. బుధవారం మండల వైసిపి కార్యలయం వద్ద పలువురు ఆదినారాయణరెడ్డిని అభినందించారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి, నాయకులు గణేషం గంగిరెడ్డికి, మండల పరిషత్ అధ్యక్షులు పెన్నా కృష్ణయ్య, మండల వైసిపి కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డికి, జెసిఎస్ కన్వీనర్ వరికూటి క్రిష్ణారెడ్డికి ఆదినారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఆదినారాయణరెడ్డి

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

ప్రజాశక్తి - లింగసముద్రం మండలంలోని అన్నేబోయినపల్లి వద్దనున్న మన్నేరు నుంచి అక్రమ ఇసుక రవాణా జరుగుతుందని ఎస్ఐ ఎం.బాజీబాబుకి వచ్చిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారు జామున దాడి చేసి రెండు ఇసుక ట్రాక్టర్లను స్టేషన్‌కి తరలించారు. ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాజీబాబు తెలిపారు.

రికార్డులు స్వాధీనం

లింగసముద్రం : అంగన్‌వాడీల సమ్మె నేపథ్యంలో 45 కేంద్రాల్లో ఎలాంటి కార్యక్రమాలు జరగడం లేదు. దీంతో ప్రభుత్వం ఆదేశాల మేరకు సిడిపిఒ విజయకుమారి ఆధ్వర్యంలో బుధవారం లింగసముద్రం,పెద్దపవని సూపర్‌వైజర్లు రాధాదేవి, నీలంబరి ,విఆర్ఒలు, పంచాయితీ కార్యదర్శులు, సమక్షంలో తాళాలు పగలగొట్టి అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించారు. ఆయా కేంద్రాల్లో ఉన్న రికార్డులను, సరుకులను సచివాలయం సిబ్బందికి స్వాధీన పరిచారు. సీడీపీఓ విజయకుమారి తహశీల్దార్ టి.ప్రసాద్ సమక్షంలో ఎంపిడిఒ కార్యలయం పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రం తాళాలను పగులకొట్టారు.



కందుకూరు వాసులకు ప్రయాణ కష్టాలు

ప్రజాశక్తి - కందుకూరు :

కందుకూరును నెల్లూరు జిల్లాలోకి మార్చి రెండేళ్లు కావస్తోంది. అయినా కందుకూరు అర్‌టిసి డిపో నుంచి నెల్లూరుకు డైరెక్ట్‌గా వెళ్లేందుకు ఇప్పటికీ బస్సులు లేవు. దీంతో ప్రజలు నెల్లూరు పోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ మధ్యకాలంలో కొన్ని రోజులు ఉదయం పూట కందుకూరు నుంచి తిరుపతికి సర్వీసులు వేశారు. అవి ప్రస్తుతం నిలిపివేశారు. నెల్లూరు డైరెక్ట్ బస్సుకు వెళ్లాలంటే ఉదయం వాకాడు డిపో సర్వీసు ఒక్కటే ఉంది.

తర్వాత నెల్లూరుకు వెళ్లాలంటే బస్సులు లేని పరిస్థితి. కావలి పల్లెవెలుగు సర్వీసులో కావలి వెళ్లి అక్కడి నుంచి నెల్లూరు వెళ్లల్సి ఉంది. పలేవెలుగు బసులో కావలి వేళి అక్కడ నుండి నెల్లూరు వెళ్లడానికి 3 సమయం పడుతోంది. పాలకులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి కందుకూరు ప్రజల సౌకర్యార్థం జిల్లా కేంద్రమైన నెల్లూరుకు డైరెక్టగా ప్రజలు వెళ్లేందుకు సర్వీసులు నడపాల్సిన అవసరంపై దృష్టిసారించాల్సిన అవసరముంది.

పొగాకు రైతులకు సూచనలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ఒకటో వేలం కేంద్రాన్ని పొగాకు బోర్డు దక్షిణ ప్రాంత ప్రాంతీయ అధికారి యం లక్ష్మణరావు బుధవారం సంద ర్శించారు. సింగరబొట్ల పాలెం లోని పొగాకు తోటలను పరిశీలించారు. లక్ష్మణరావు రైతులకి పలు జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు చేవారు. వేలం నిర్వహణాధికారి చైన్ రామ్ మీనా , పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు..

మంచినీరు సరఫరా

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు ఆనందపురం గ్రామంలో 7 రోజుల నుంచి మంచినీటి సరఫరా నిలిచిపోయింది. మున్సిపాలిటీ అధికారులకు ఫోన్ చేసినప్పటికీ నామమాత్రంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కందుకూరు నియోజవర్గ టిడిపి ఇన్ఛఆర్జిస ఇంటూరి నాగేశ్వరరావు స్పందించి టాంకర్ ద్వారా గత 4 రోజుల నుంచి నీరు సరఫరా చేస్తున్నారు. గ్రామస్తులు నాగేశ్వరావు గారికి కతజ్ఞతలు తెలిపారు.

దాణా పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లూరు :తుపాన్ కారణంగా దళిత, గిరిజన వర్గాలకు చెందిన పశు పోషకులకు గుడ్లూరు మండలం, పూరేటిపల్లిలో ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరంలో రెండు టన్నులు పశువుల దానా ఉచితంగా బుధవారం అందజేశారు. పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. ఉలవపాడు సహాయక సంచాలకులు కందుకూరు డాక్టర్ చంద్రశేఖర్ డాక్టర్ సురేష్ నాయుడు ఉన్నారు.

అధికారులు, రైతులతో మేకపాటి సమీక్ష

ప్రజాశక్తి-జలదంకి : జలదంకిలోని ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఉదయగిరి వైసిపి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి, సోమశిల అధికారులు, జలదంకి మండల రైతన్నలు పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎంతవరకు రైతన్నలకు సాగునీరు ఇవ్వగలమని చెప్పాలని అధికారులకు సూచించారు. కావలి కాలువకు మూడు టిఎంసిల నీటిని ఇచ్చేందుకు ప్రాణాలిక సిద్ధమైందని మరో రెండు టిఎంసిలు కేటాయించగలిగితే ప్రతీ ఎకరాకు సాగునీరు ఇవ్వగలమని సోమశిల జలాశయంలో ఆశించిన మేర నీరు చేరలేదన్నారు. ఈ విషయంపై స్పందించిన మేకపాటి రాజగోపాల్ రెడ్డి జిల్లా మంత్రి, కాకాణి గోవర్ధన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని, ప్రతీ ఎకరాకు సాగునీరు ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. మరో నాలుగు రోజులలో పూర్తి వివరాలు రైతన్నలకు తెలియజేస్తామని అధికారులకు, పాలకులకు స్పష్టం చేశారు. జలదంకి మండలంలో జరగనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించిన కిట్లను క్రీడాకారులకు మేకపాటి రాజగోపాల్ రెడ్డి చేతులు మీదగా అందజేశారు. జలదంకి మండల యువత క్రీడల్లో రాణించాలని రాష్ట్రస్థాయి బహుమతులు కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి సింగయ్య, తహశీల్దార్ బివి రమణారావు, వైసిపి మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ అధ్యక్షులు కేతిరెడ్డి రవీంద్రారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి ఇస్కు మదన్మోహన్ రెడ్డి, మండల రైతు అధ్యక్షులు గండు కృష్ణారెడ్డి, ఇఇ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ శ్రీనివాసరావు, సంగం డిఇ వెంకట రమణయ్య, కావలి డిఇ మహేష్, జయశంకర్, ఎఇఇ ఎ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు

ప్రజాశక్తి-బిట్రగుంట : ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న మహిళల కోసం ఉచిత గ్యాస్ కనెక్షన్‌ను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని విశ్వనాథరావు పేట సర్పంచ్ గండూరి మంజుల పేర్కొన్నారు. బోగోలు పంచాయతీ సర్పంచ్ పి.అనిత ఆధ్వర్యంలో విశ్వనాథరావుపేటపేట పంచాయతీ గండూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో దీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఎంపిడిఒ వెంకటసుబ్బారావు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంజుల మాట్లాడుతూ ప్రధానమంత్రి యోజన పథకం కింద రూ.80లక్షల మంది మహిళలకు ముద్రా లోను అందజేస్తుందని, ప్రధానమంత్రి యోజన గ్రామీణ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన ఇళ్లకు రుణాలను అందిస్తుందని, సుకన్య పథకం కింద మహిళలకు రుణాలను అందజేస్తుందని, వెలుగు కార్యక్రమం కింద పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు, రైతులకు, పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొని వచ్చి ప్రతిఒక్క కుటుంబానికి ఆసరాగా నిలిచారని తెలిపారు. సీనియర్ నాయకులు గండూరి శ్రీనివాసులు, ఉపసర్పంచ్ పెండ్లి వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ వెంకట సుబ్బారావు, ఎఒ విజయలక్ష్మి, ఎపిఒ, ఎపిఎం, కార్యదర్శి మహబూబ్ బాషా, వార్డు సభ్యులు భారతి, చిలక జయరాం, సుధీర్ పాల్గొన్నారు.

వైసిపిలో నాయకులకు ప్రముఖస్థానం

ప్రజాశక్తి-మర్రిపాడు : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన వారికి జిల్లా పార్టీ అనుబంధ విభాగాల్లో స్థానం కల్పించారు. జిల్లా ఐటీ విభాగం కమిటీ అధ్యక్షులుగా కొప్పోలు వెంకటేశ్వర్లు, జిల్లా రైతు విభాగం సెక్రటరీ గంగినేని రవీంద్రబాబు నాయుడు, జిల్లా మైనారిటీ సెల్ సెక్రటరీ షేక్ మౌలాలి, వైఎస్ఆర్ సేవాదల్ విభాగం సెక్రటరీ చంద్ర నారాయణ స్వామి, జిల్లా యువజన విభాగం సెక్రటరీ కొమ్మూరి ప్రతాప్ జిల్లా ఎస్‌సిసెల్ జనరల్ సెక్రటరీ మన్నెపల్లి లక్ష్మీనారాయణ, జిల్లా క్రిస్టియన్ సెక్రటరీగా సోంపల్లి ఓబులేసు నియమితులయ్యారు. అనంతరం వారు పార్టీ అభివృద్ధి కోసం నిరంతం కృషి చేస్తామని, 2024 సాధారణ ఎన్నికల్లో మళ్లీ వైసిపి అధికారమే ధ్యేయంగా పని చేస్తూ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు. జిల్లా స్థాయి పదవులు రావడానికి సహకరించిన మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, ఎంఎల్ఎ విక్రమ్ రెడ్డి, వైసిపి కన్వీనర్ సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు, భీమవరం సొసైటీ చైర్మన్ మాధవ రెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

మండలానికి చేరుకున్న ట్యాబులు

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్లు పంపిణీకి శ్రీకారం చుట్టింది. గత సంవత్సరం కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ ట్యాబ్లు పంపిణీకి శ్రీకారం చుట్టారు. మరలా అదే సందర్భాన్ని పురస్కరించుకుని 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబులు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కోవూరు మండల ప్రాథమిక విద్యా కేంద్రానికి తొలి విడతగా 250 ట్యాబులు చేరుకున్నాయి.

ఓటువేసే విధానంపై అవగాహన

ప్రజాశక్తి-కోవూరు : భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం బుధవారం కోవూరులోని తహశీల్దార్ కార్యాలయంలో ఈవిఎం మిషన్ ద్వారా ఓటు వేసే విధానంపై అవగాహన కార్యక్రమాన్ని తహశీల్దార్ ఎం. పద్మజ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క ఓటరూ ఈ ఈవిఎం మిషన్ ద్వారా ఓటు ఏ విధంగా వేయాలి అనే విషయమై వారిలో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు మండలంలోని పోలింగ్ స్టేషన్ ప్రాంతాల్లో ఈవీఎంల డెమాని స్ట్రేషన్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.. ఈ సందర్భంగా తాలూకా కార్యాలయ ప్రాంగణంలోని పలువురు అధికారులు ఈవీఎంల ద్వారా ఓటు ఎలా వేయాలో ప్రయోగాత్మకంగా నిర్వహించారు. ఎంఇఒ రహీం, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ మధు, ఎఎస్ చంద్రశేఖర్, డి టి ఇలియాజ్ తదితరులున్నారు.

ఆగని గ్రావెల్ మాఫియా

ప్రజాశక్తి-కొడవలూరు : బుచ్చిరెడ్డిపాలెం మండలం, మినగల్లు గ్రామంలో గత రెండేళ్ల నుంచి పాలకొండతిప్ప కనిపించడం లేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి సమాచారం మేరకు గ్రామస్తులు అందించిన వివరాలు ప్రకారం.. వైసీపీ నాయకులు, అధికారులు కుమ్మక్కై పాలకొండను మింగేశారంటూ గ్రావెల్ మాఫియాపై ధ్వజమెత్తారు. నాయకులు అధికారులతో చేతులు కలిపి పాలకొండలోని గ్రావెల్ మొత్తం తవ్వేసి కోట్లు సంపాదించారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా గ్రావెల్ మాఫీ ఆగడాలలో మరో కొత్త సంచలనం ఏమిటంటే ప్రభుత్వ భూమికి చెందిన ఆ పాలకొండను గ్రావెల్ మింగేసిందే కాక, నేడు దానినీ చదును చేసి పొలాలుగా మార్చి పట్టాలుగా మార్చుకోవాలని కరుడుగట్టిన కేటుగాళ్ళు, అధికారులు సైతం ఆలోచిస్తున్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇదే పాలకొండ విషయమై అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు ముట్టినట్లుగా ఆరోపించారు. ఎంతో చరిత్ర కలిగిన పాలకొండ తిప్పను నేడు గ్రావెల్ మాఫియా అధికారులతో కలిసి మాయం చేయడంపై ఒకింత దిగ్భ్రాంతి ప్రజలు వ్యక్తం చేశారు.

ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-కొడవలూరు : ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు స్పష్టం చేశారు. మండలంలోని యల్లాయపాలెం-1 సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో వైఎస్ఆర్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలకు ఏం కావాలో తెలుసుకొని పరిష్కరించే ఏకైక ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలిజ్యోతి, విజయ డెయిరీ డైరెక్టర్ విషనాక సునీల్ రెడ్డి పాల్గొన్నారు.

రూ.2వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి-కావలి : స్థానిక ముసునూరులోని చంద్రబాబు నాయుడు కాలనీలో నివాసముంటున్న రామిశెట్టి వేణు సుమారు రెండు సంవత్సరముల నుంచి తన రెండు కాళ్ళు బోధకాలుతో నడవలేని పరిస్థితిలో ఉన్న సందర్భంలో కావలిలోని, కాపు నాయకులు అతని పరిస్థితిని చూసి, చలించి రూ.2వేలు, ఒక బియ్యం బస్తా, ఇంటికి పోయే ప్రొవిజన్స్ సరుకులు అందజేశారు. కార్యక్రమంలో దేవరకొండ శ్రీనివాసరావు, సమ్మను వెంకటసుబ్బయ్య, సాదు శ్రీధర్, తోకల వెంకటేశ్వర్లు, పసుపులేటి బాబురావు, రామిశెట్టి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ



ప్రజాశక్తి-ఉదయగిరి : బర్డిట్ మెమోరియల్ చర్చి కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నల్లిపోగు ప్రసాద్ క్రిస్మస్ పండుగ సందర్భంగా బుధవారం మదర్ థెరిస్సా ఫౌండేషన్ అనాథులకు బియ్యం నిత్యావసరాలు కమిటీ సభ్యులతో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బర్డిట్ మెమోరియల్ చర్చి కమిటీగా క్రిస్మస్ పండుగ సందర్భంగా అనాథులైన పేదవారిని ఆదరించడం సంతోషదాయ కమన్నారు. ప్రతిఒక్కరూ కూడా తమ మానవత్వ దృక్పథం చాటుకునేందుకు ఇలాంటి ఫౌండేషన్ ద్వారా ఆదరిస్తున్న వారికి తమవంతుగా సహాయ సహకారాలు అందించాలన్నారు. చర్చి సంఘకాపరి పి.సుధీర్ కుమారు ఎగ్జిక్యూటివ్ మెంబర్ రాబోట్ ప్రభాకర్, అశోక్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సునీల్, కిషోర్, స్మార్ట్ జోసెఫ్, రోశయ్య, విద్యాసాగర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

- పలుచోట్ల భిక్షాటన, వంటావార్పు, మానవహారం - తాళాలు పగలగొట్టడాన్ని ఖండించిన నాయకులు

సీతారామపురంలో..

రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి : టిడిపి

ప్రజాశక్తి-సీతారామపురం : అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న మొండి వైఖరిని విడిచిపెట్టాలని మండల టిడిపి నేతలు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరసన దీక్షకు మండల టిడిపి నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా కేంద్రాల తాళాలు పగలగొట్టి సచివాలయ సిబ్బంది ద్వారా సెంటర్లను నడిపించే ప్రయత్నం చేయడం శోచనీయమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు టిడిపి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, ఎం.ఆదయ్య, నెలటూరి జాషువా, పిడుగు రమేష్, తురక వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, బండి రవి, మండల సిఐటియు నాయకులు కోడె రమణయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమ్మెలో భాగంగా 9వ రోజు మండల కార్యాలయంలో అంగన్‌వాడీలు భిక్షాటన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో భిక్షాటన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో అంగన్‌వాడీ జీతాలు తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తామని వాగ్దానం చేశారని, కానీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ మాట మర్చిపోయారన్నారు. అంగన్‌వాడీలు భిక్షాటన చేసే స్థితికి రావడం ఈ ప్రభుత్వానికి మాయనిమచ్చ అని అన్నారు. ప్రభుత్వం ఇదే ధోరణిగా ప్రవర్తిస్తే రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతామని అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపేందుకు రైతు సంఘం నాయకులు షానవాజ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు, సిఐటియు మండల గౌరవ అధ్యక్షులు షేక్ చాన్‌బాషా, నక్క నరసింహ, వీర అజయ్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదుచేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-అనంతసాగరం : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం బలవంతంగా సచివాలయ ఉద్యోగులు పంచాయతీ కార్యదర్శులు వీఆర్‌ఒలతో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టడంపై సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అనంతరం నల్ల రిబ్బన్లు తట్టుకొని మౌన ప్రదర్శన చేశారు. అనంతరం సిఐటియు మండల కార్యదర్శి అన్వర్ భాషా మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ల తాళాలను బద్దలు కొట్టడం దుర్మార్గమైనదని, రాష్ట్ర ప్రభుత్వానికి గత నాలుగు సంవత్సరాల నుండి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు విన్నవించిన ప్రభుత్వం పట్టించుకోలేదని, ఆగ్రహించిన అంగన్‌వాడీలు రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చి సమ్మెకు వెళ్లారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా అంగన్‌వాడీ సెంటర్లను ఉద్యోగస్తులతో బలవంతంగా తాళాలు పగలగొట్టి అంగన్‌వాడీ సెంటర్లు తెరిపించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు జనసేన మండల అధ్యక్షుడు మహబూబ్ మస్తాన్ తమ మద్దతును ప్రకటించారు. కార్యక్రమంలో అనంతసాగరం ప్రాజెక్టు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు నాయకులు సునీత, లక్ష్మి, సుబ్బమ్మ, నూర్జహాన్, భాగ్యమ్మ, సిఐటియు మండల కమిటీ సభ్యుడు నాగులూరు వెంకటేష్, ప్రాజెక్టులోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలపై నిర్లక్ష్య ధోరణిగా వ్యవహరిస్తుందని, ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అంగన్‌వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు పి.రాధమ్మ పేర్కొన్నారు. బుధవారం 9వ రోజు భిక్షాటన చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాధమ్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా వచ్చిన ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా ప్రకటించిందని, నెలకు రూ.18వేలు అమలు చేస్తామని, ఇపిఎఫ్ అమలు చేస్తామని ప్రకటించారని, ఎపిలో మాత్రం ఇచ్చిన హామీలు సైతం నెరవేర్చలేదన్నారు. డిమాండ్ల సాధన కోసం జరిగే నిరసనలో రోజురోజుకు మరింత ఉధృతం చేస్తామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెరిగిన ధరలను బట్టి ఇప్పుడున్న వేతనాలు చాలీచాలక అంగన్వాడీల కుటుంబాలు జీవనం సాగించలేకపోతు న్నామని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. మున్సిపల్ బస్టాండ్ నుండి ఆర్‌టిసి బస్టాండ్ వరకు భిక్షాటన చేశారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మెకు మద్దతుగా కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి అంగన్‌వాడీలకి మద్దతు తెలిపి సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సిఐటియు గౌరవ అధ్యక్షులు, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, జిల్లా కౌలు రైతుసంఘం ఉపాధ్యక్షులు గంటా లక్ష్మీపతి, ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి లక్కు కృష్ణ ప్రసాద్, ఒంటేరు మల్లికార్జున, ప్రజానాట్య మండలి షేక్ షకూర్, అంగన్‌వాడీ సెక్టార్ లీడర్లు కె.రమణమ్మ, కామేశ్వరీ, జమీల, విజయలక్ష్మి, విజయమ్మ, మస్తానమ్మ, పద్మావతి, శ్రీదేవి, విజయమ్మ, రూతమ్మ, వెంకటరమణమ్మ, విజయభారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ప్రజాశక్తి-కావలి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరవధిక సమ్మె 9వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిడిపిఒ ఆఫీస్ దగ్గర ఈ రోజు వంటావార్పు కార్యక్రమాన్ని కొనసాగించి అక్కడే భోజనాలు చేశారు. ఈ సమ్మెకు ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయమ్మ, వసుందర దేవి పాల్గొని తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు హెల్పర్లు సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు పి.పెంచలయ్య, మాల్యాద్రి పాటి భాస్కర్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు పాల్గొని మద్దతును తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు రఘురావమ్మ, విజయలత సుభాషిణి లతోపాటు 700మంది టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

కావలిలో వంటావార్పు

ఉదయగిరిలో మానవహారం

ప్రజాశక్తి-ఉదయగిరి : అంగన్‌వాడీలు మానవహారంతో చేపట్టిన ఆందోళన వారి సమస్యలతో ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌ను దద్దరిల్లించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం 9వ రోజు నిరవధిక సమ్మెను కొనసాగించి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అంగన్‌వాడీలపై దౌర్జన్యం భయభ్రాంతులకు గురి చేయడం జగన్ ప్రభుత్వానికి సిగ్గుచేటని సిఐటియు నాయకులు కాకు వెంకటయ్య ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట తప్పని మడమ తిప్పని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు మరిచి ఒత్తిళ్లు తేవడం ఏమిటని దుయ్యబట్టారు. అంగన్‌వాడీ సెంటర్లను దౌర్జన్యంగా బలవంతంగా తాళాలు పగలకొట్టడం ప్రభుత్వ నిరంకుశ పాలనకు అద్దం పట్టినట్లు కనిపిస్తుందన్నారు. అక్రమంగా తాళాలు పగలగొట్టిన వారిని అరెస్టు చేయాలన్నారు. జరిగే పార్లమెంటు సమావేశంలో అంగన్వాడీల సమస్యలు చర్చించి సమస్యను పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఈ సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ప్రమీల, నాయకులు రమాదేవి, విద్యార్థి సంఘం నాయకురాలు కళ్యాణి, సిఐటియు నాయకులు అంగన్‌వాడీలున్నారు.

కోవూరులో వంటావార్పు

ప్రజాశక్తి-కోవూరు : స్థానిక అంగన్వాడీ ప్రాజెక్ట్ ఆఫీసు ఎదుట 9వ రోజు దీక్షలు జయప్రదం మహిళా సంఘం సీనియర్ నాయకులు జక్కా శేషమ్మ దీక్షలను ఉద్దేశించి మాట్లాడారు. పట్టువదలకుండా తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తుంటే ,, సారా ఉద్యమం,, గుర్తుకొస్తుంది మీపోరాటం పై ప్రభుత్వం స్పందిచకపోవడం బాధాకరమన్నారు. మహిళలపట్ల చులకనభావం, తమ న్యాయమైన కోర్కెలు నెరవేర్చుటకు రాష్ట్రవ్యాప్తంగా ఐక్యగా పోరునడుస్తుంటే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్టు లేదన్నారు. అధికారానికి రాకముందు చెప్పిన మాటలు చేతల్లో లేద న్నారు. ఇచ్చిన వాగ్దానలపై ప్రభుత్వం జిఒ విడుదల చేసి వెంటనే చర్చలకు పిలవాలని తాళాలు పగలగొట్టి మ హిళలను రెచ్చగొట్టే ధోరణి మానుకోవాలి తమ న్యాయమైన కోర్కెలు సాధించేంత వరకు పోరాడాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా యూనియన్ నాయకులు ఎల్‌వి శేషమ్మ, విజయమ్మ, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి గండవరపు శేషయ్య, మారుబోయిన సుబ్బారావు, బుజ్జయ్య, అంగన్‌వాడీలున్నారు.

అంగన్‌వాడీలకు 'ఉమెన్స్ ఫోర్స్' మద్దతు

ప్రజాశక్తి-కావలి : గత 8 రోజుల నుండి తమ న్యాయమైన కోర్కెలను తీర్చి ఉద్యోగభద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ సమ్మెకు దిగిన అంగన్‌వాడీ వర్కర్స్ - హెల్పర్స్ ధర్నా న్యాయమైనదేనని, వారు కోరుతున్న కోర్కెలను ప్రభుత్వం పరిష్కరించాలని కావలి ఉమెన్స్ ఫోర్స్ కన్వీనర్ సి.శారద, ఎస్. ప్రభావతి, కె.నాగమణి, టి.సుజాత పేర్కొన్నారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఎన్నెన్నో ఉచిత పథకాలకు అయ్యే ప్రజాధనంలో ఈ ఖర్చు పట్టించుకునేంత ఎక్కువ కాదని, బడ్జెట్‌కు భారమేమీ కాబోదని తెలిపారు. అతిస్వల్ప జీతంతో మొదలైన తమ ఉద్యోగ బాధ్యతలు ఈరోజు రూ.11వేల జీతం పెరిగిన నిత్యావసరాల ఖర్చుకు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల వేసి ఉన్న తాళాలను సచివాల యు సిబ్బందితో పగలగొట్టించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నా మన్నారు. ఉద్యమాల పుట్టినిల్లు అయిన నెల్లూరు మహిళాలోకం తలచుకుంటే ఏదైనా సాధిస్తారని, కావలిలోని మహిళా, విద్యార్థి, ప్రజా సంఘాలతో ఐక్య కార్యాచరణ కమిటీని, ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సిఎం జన్మదిన వేడుకలను విజయవంతం చేయండి

మాట్లాడుతున్న ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూరు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని, నియోజకవర్గ పరిధి లోని వైసిపి నాయకులు, కార్యకర్త లు, అభిమానులు అందరూ గురువారం ఉదయం 10గంటలకు జరిగే జగనన్న జన్మదిన వేడుకల్లో పాల్గొని విజయ వంతం చేయాలని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి కార్యక్రమ వివరాలపై అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రజలందరికీ మేనిఫెస్టో అంటే గౌరవం పెంచిన ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలకు సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతిఒక్కరూ తమ ఇంట్లో జరుపుకుంటారని, అలాంటి జగనన్న జన్మదిన వేడుకలను అందరం సమిష్టిగా ఓ పండుగలా నిర్వహిద్దామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు, మొక్కలు నాటడం, అన్నదానం, రక్తదానం, కేక్ కటింగ్, విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహణ ఉంటుందని, కార్యక్రమానికి వచ్చే ఎవరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు. ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు షేక్ సర్దార్, డాక్టర్ కెవి శ్రావణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ



ప్రజాశక్తి-ఉదయగిరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రూ.25 లక్షలు చేసిన ఆరోగ్యశ్రీ కార్డులను జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు, సర్పంచ్ సామ్రాజ్యం, మాజీ ఎంపిపి చేజర్ల సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ ఓబుల్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రూ.5లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ కార్డును రూ.25లక్షలు చేసిన ఘనత సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏర్పాటు చేసిన ఈ ఆరోగ్యశ్రీ తో ఎందరో గుండె జబ్బులు ఖర్చుతో కూడిన పలురకాల వైద్య అందించుకొని వారి హృదయాల్లో నిలిచారని అంతకుమించి తనయుడు జగన్మోహన్ రెడ్డి చేసి ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు భిన్నంగా ఆరోగ్యపై ముందడుగు వేస్తూ ప్రజలలో చిరస్థాయి ముద్రగ నిలిచిపోతున్నారని వివరించారు. ఇలాంటి వ్యక్తిని ప్రతి గడపలో అందిన సంక్షేమ పథకాలు మళ్లీ అమలు జరగాలన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి చెందాలన్నా మేకపాటి రాజగోపాల్ రెడ్డిని గెలిపించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఆయనను గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు పెద్ద మస్తానీ, ఎస్దాని, సుభహన్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ గడియాల్సి ఎస్దాని, ఉపసర్పంచ్ మూర్తుజ, సర్పంచులు కల్లూరి వెంకటేశ్వర్ రెడ్డి, గౌస్ మొహిద్దీన్, యుపిఆర్‌డి మల్లికార్జున, కార్యదర్శి నరసయ్య, వైసిపి నాయకులు వాలంటరీలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

వైసిపి ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అంజేసిన ఘనత సిఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైసిపి నాయకులు అన్నారు. మండలంలోని తూర్పు బోయమడుగుల సచివాలయ పరిధిలోని తూర్పు బోయమడుగుల చెన్నంపల్లి గ్రామాలలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉదయగిరి నియోజకవర్గ సమన్వయ కర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి తిరిగి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వారికి వివరించారు. అందని వారికి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులకు అందేలా చూడాలని తెలిపారు. అనంతరం అసైన్డ్‌మెంట్ సాగు రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలను ఆయన రైతులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామగ్రామాన సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల వద్దకు పాలన చేర్చి జగన్మోహన్ రెడ్డి సామాజిక సాధికారతకు శ్రీకారం చుట్టారన్నారు. వైసిపి అధికారం చేపట్టిన నాటి నుండి పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న జగనన్న పాలనకు ప్రజలు నిరాజనాలు సమర్పిస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ పథకాలను జగనన్న చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజల్లో ఆదరణ పెరుగుతుంద న్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి చైర్మన్ అలీ అహ్మద్, మండల కన్వీనర్ తిరుపతి నాయుడు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాగంటి శ్రీనివాసులు, జెడ్‌పిటిసి రావేల నాగేంద్ర, సొసైటీ చైర్మన్ గుంటుపల్లి రామాంజనేయులు, మాగంటి తిరపతినాయుడు, చెన్నారాయుడు, తిరుపతి రెడ్డి, రాయవరపు మధు, నాగభూషణం, అధికారులు సచివాలయ సిబ్బంది, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల కార్డును అందజేస్తున్న మేకపాటి

ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు బార్ అసోసియేషన్, ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సెషన్ కోర్ట్ ఆవరణంలో 2023 ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది కె.వి.శేషారెడ్డి, ఎపి రైతుసంఘం మండల ప్రధాన కార్యదర్శి లక్కు కృష్ణ ప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న భూమి యాజమాన్యపు హక్కులు నిర్ధారించేందుకు కొత్త కమిటీలు ఏర్పాటు చేశారని, భూమికి సంబంధించిన ప్రతీ అంశాన్ని ఈ కమిటీకి రైతులు కానీ ప్రజలు కానీ నివేదించాలని, అలా నివేదిస్తే భూమి హక్కు ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. ఇప్పటివరకు వివాదంలో లేని భూములు కూడా వివాదంలోకి వచ్చే అవకాశం ఉందని ప్రజలు దానిని గుర్తించాలని తెలియజేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ కోసం కేంద్ర ప్రభుత్వం సూచించిన సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చిందని, దీనివల్ల సామాన్య ప్రజలు వారి హక్కులను కమిటీల పర్యవేక్షణలో రావాల్సి వస్తుందని తెలియజేశారు. ఈ చట్టం వల్ల ప్రజలలో విభేదాలు తలెత్తే అవకాశం ఉందని, ఈ చట్టంపై విస్తృతమైన చర్చలు జరపాలని సూచించారు. గురించి సభలో సమావేశం నిర్వహించి వారిలో చైతన్యాన్ని నింపేందుకు రెండు మూడు రోజుల్లో రైతు సంఘాల రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసుకొని రూపొందించు కోవాలని తీర్మానించారు. ఈ చట్టానికి సంబంధించిన అంశాలను త్వరలోనే ఫాంప్లెట్ రూపంలో తయారుచేసి ప్రజలకు అందించాలని తీర్మానం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు షేక్ నజీర్, మధుసూదన్, సురేష్, టిడిపి నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, పులిమి శైలజా రెడ్డి, చంద్రా వెంకటసుబ్బ నాయుడు, పిడికిటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న న్యాయవాది కె వి శేషారెడ్డి

నేడు చెకుముకి టెస్ట్

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని రెడ్‌క్రాస్ భవనంలో గురువారం ఉదయం 9.30 గంటలకు కావలి పట్టణ స్థాయి, కావలిరూరల్ మండలం స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పట్టణ జెవివి అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు తెలియజేశారు. కావలి పట్టణ, కావలి రూరల్ మండలం నుండి దాదాపు 40స్కూల్స్ నుండి ఒక్కో స్కూల్ నుండి ముగ్గురు విద్యార్థులు చొప్పున 120మంది విద్యార్థులు పాల్గొంటారని, గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రదానం ఉంటుందని, జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్, టెస్ట్‌కు ఎంపిక చేయబడుతుందన్నారు. అదే విధంగా కావలి పట్టణ, కావలిరూరల్ మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ విజయవంతం చేయడానికి పాఠశాల కరస్పాండెంట్స్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు సంపూర్ణ సహకారాలు అందించాలన్నారు.

20న ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 సంవత్సరం 6వ తరగతిలో ప్రవేశ పరీక్షలు జనవరి 20న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ రావు తెలియజేశారు. ప్రవేశ పరీక్షకు సంబంధించి హాల్ టిక్కెట్లు డిసెంబర్ 18న వెలువడ్డాయని జిల్లాలోని కామన్ సర్వీసెస్ కేంద్రాల్లో జవహర్ నవోదయ విద్యాలయ సమితి వెబ్ సైట్ www.navodaya.gov.in ద్వారా రిజిస్ట్రేషన్ నెంబర్, పుట్టిన తేదీ ఉపయోగించి డౌన్లోడ్ చేసుకోవచ్చ న్నారు. ఇతర సమాచారం కోసం జిల్లా కేంద్రం ఫోన్ నెంబర్లు 8985007588, 9493514644, 8106898817లను సంప్రదించాలన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌విఎస్ ప్రసాద్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-నెల్లూరు : విశ్రాంత అటవీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని విశ్రాంత అటవీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌విఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో బుధవారం అటవీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఎన్‌విఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్‌కె అల్లాభక్షు, సెక్రటరీగా పి.శ్రీనివాసులు, ట్రెజరర్‌గా డి.రామచంద్రయ్య, కమిటీ సభ్యులుగా కృష్ణారావు, జనార్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్, రవి, హజరత్తయ్య, మ్యాథ్యూస్, కోదండ రామయ్య, తిరుపాల్‌లను ఎన్నుకున్నారు. అనంతరం 70 యేళ్లకు పైబడిన వారిని సన్మానించారు. విశ్రాంత ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ డి.లక్ష్మీకాంతరెడ్డి మనుమరాలు జ్యోత్నిషరెడ్డి చేసిన నృత్య కార్యక్రమం అలరించింది. జనవరి 8వ తేదీన విజయవాడలోని పున్నమిఘాట్‌లో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కె గాలిబ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పూర్ణచంద్రరావు, రాష్ట్ర కోశాధికారి కె.శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఉపకరణాలు పంపిణీ

పోటీలు ప్రారంభిస్తున్న దగ్గుమాటి వెంకటకృష్ణా రెడ్డి

ప్రజాశక్తి-కావలి : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం బుధవారం స్థానిక షాదీ మంజిల్‌లో దివ్యాంగుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి, టిడిపి రాష్ట్ర దివ్యాంగుల సంఘం ఉపాధ్యక్షులు మండవ వెంకట్రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టిడిపి నియోజకవర్గ నాయకులు దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ఆటల పోటీలలో పరుగు పందేలు, ట్రైసైకిల్ పరుగు పందెం, మహిళలకు మ్యూజికల్ చైర్ లాంటి పలురకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన సభలో మండవ వెంకటరావు మాట్లాడుతూ 3వ తేదీన జరగాల్సిన దివ్యాంగుల దినోత్సవాన్ని తుపాన్ వల్ల 20వ తేదీన జరుపుకుంటున్నామని తెలిపారు. ఇందుకు జయచంద్ర నాయుడు 250మందికి భోజనం సౌకర్యం కల్పించారన్నారు. టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు రూ.10వేలు, దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి రూ.15 వేలు, మాజీ బిజెపి నాయకులు పసుపులేటి సుధాకర్ రూ.5వేలు విరాళాలిచ్చారని తెలిపారు. ఇంకా కొన్ని సంస్థలు, వ్యక్తులు ఇచ్చిన సహకారంతో 4గురికి ట్రై సైకిళ్ళు, ముగ్గురికి వీల్ చైర్లు, 4సెట్లు కాలిపర్లు, 250మందికి దుప్పట్లు పంపిణీ చేశామని వివరించారు. ఈ సభలో పలు ప్రాంతాల దివ్యాంగ నాయకులు రోటరీ సభ్యులు కె.గోపిక్రిష్ణ, ఆర్.వి.ఆర్. రియల్ ఎస్టేట్స్ ప్రతినిధులు, పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఘనిబాషా, మహబూబ్ బాషా, కోడూరు సోమయ్య, బొల్లా వేణు, తదితర దివ్యాంగ సభ్యులు పాల్గొని జయప్రదం గావించారు.

సభలో మాట్లాడుతున్న మండవ వెంకట్రావు

రైతులకు మొండిచేయి

ప్రజాశక్తి-జలదంకి : సాగునీటి విషయంలో సోమశిల జలాల కేటాయింపులో జలదంకి మండల రైతాంగానికి మొండిచేయి చూపుతున్నారని అధికారులు తీరుపై కావలి మాజీ ఎంఎల్ఎ వంటేరు వేణుగోపాల్‌రెడ్డి విరుచుకుపడ్డారు. 30 టిఎంసిలతో ప్రారంభమైన సోమశిల ప్రాజెక్టు 70 టిఎంసిల సామర్థ్యానికి చేరుకున్న కూడా డెల్టా నాన్ డెల్టా అంటూ వివక్ష చూపుతున్నారన్నారు. మీచాంగ్ తుపాన్‌తో సోమశిల ప్రాజెక్టులోకి నీరు వచ్చినా కూడా కావలి కాలువకు రెండు టిఎంసిలు నీటిని కేటాయించేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్నారు. తాను ఎంఎల్ఎగా ఉన్న సమయంలో సోమశిలలో 7 టిఎంసిలు నీరు ఉండగా జలదంకి మండలానికి సాగునీరు ఇచ్చి పంటలు పండించానన్నారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ చేవూరి పాపిరెడ్డి మాట్లాడుతూ రెండు టిఎంసిల నీటిని కేటాయిస్తే జలదంకి మండలంలోని పొలాలన్నీ పండుతాయన్నారు. కార్యక్రమంలో వేలమూరి శ్రీనివాసుల రెడ్డి, ఒంటేరు భాస్కర్‌రెడ్డి, వేలమూరి పాండురంగారెడ్డి, దేవరపల్లి కృష్ణారెడ్డి, పల్లెపు ఏడుకొండలు, ఒంటేరు నందగోపాల్ రెడ్డి, రైతన్నలు పాల్గొన్నారు.

18వ డివిజన్‌లో ఏపీ వై నీడ్స్ జగన్

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 18వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ హరినాథపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు 18వ డివిజన్ కార్పొరేటర్ టి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేయడం జరిగింది. 18వ డివిజన్లోని హరినాథపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రజలకు అందించిన అనేక సంక్షేమ పథకాలను తెలిపే డిస్ప్లే బోర్డును డివిజన్ వైసిపి నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజలకు ప్రభుత్వం నవరత్నాల ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఒక్కొ క్కటిగా వివరించారు. ఈ సందర్భంగా సచివాలయంలో పార్టీ జెండాను డివిజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఆవిష్కరించారు. స్థానిక డివిజన్ నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను డోర్ టు డోర్ తిరుగుతూ ప్రజలకు సమగ్రంగా వివరించడం జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గడిచిన 8 నెలల స్వల్ప కాలంలో 150 కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి నెల్లూరు రూరల్ నియోజక వర్గం అభివృద్ధి పథంలో నడిపిస్తున్న నెల్లూ రు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డికి రూరల్ ప్రజలందరూ తమ సంపూర్ణ మద్దతు అందించి 2024 సంవత్సరంలో జరగ నున్న సాధారణ ఎన్నికల్లో భారీ మెజా రిటీతో గెలిపించాలని స్థానిక ప్రజలను కోరారు. కార్యక్రమంలో సిహెచ్ హరిబాబు యాదవ్, ఏసు నాయుడు, అశోక్ నాయుడు, ముడియాల రామిరెడ్డి, దారా వంశీ, వాలంటీర్లు, డివిజన్ వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కొండ్రెడ్డి రంగారెడ్డి

భోజన కార్మికులపై బెదిరింపులు ఆపాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మధ్యాహ్న భోజన కార్మికులపై సచివాలయం ఉద్యోగుల బెదిరింపులు ఆపాలని అధ్యక్ష, కార్యదర్శులు తమ్మిరెడ్డి రేవతమ్మ, పి.శీనమ్మలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్న సంగతి రాష్ట్రవ్యాప్తంగా తెలిసిందే. ఈ మేరకు బుధవారం మండలంలో మాచర్ల వారిపాలెం గ్రామంలో భోజన కార్మికులపై పాల్పడుతున్న సచివాలయ ఉద్యోగులకు వ్యతిరేకంగా ఆందోళన జరిగింది. ఈ సందర్భంగా రేవతమ్మ, శీనమ్మలు మాట్లాడుతూ అంగన్వాడీ పిల్లలకి భోజనం పెట్టాలన్నారు. లేకపోతే ఉద్యోగం లో నుంచి తొలగిస్తామంటూ నీ స్థానంలో ఇంకొకరికి నీ ఉద్యోగం ఇప్పిస్తామని సచివాలయ సిబ్బంది బెదిరింపులకు పాల్పడటం దుర్మార్గ మన్నారు. భోజన కార్మికులు ఎదుర్కొ ంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపిడిఓ ప్రత్యూష రెడ్డి, డిటి శివయ్య, ఎంఇఓ వేణుగోపాల్ రెడ్డిలకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల సిఐటియు గౌరవ ధ్యక్షులు వేగూరు వెంకయ్య, సిఐటియు నాయకులు ఈపూరు లక్ష్మయ్య, మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

యథావిధిగా అంగన్‌వాడీ కేంద్రాలు

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకలాపాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా యథావిధిగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా తమ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ వర్కర్స్ ఆందోళన చేపడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంది. ఈ మేరకు జిల్లాలో అంగన్‌వాడీ చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో అందజేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ఆయా సచివాలయాల పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఇన్‌ఛార్జిల బాధ్యతలను అప్పగించారు. జిల్లాలో 2934 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా బుధవారం 2778 కేంద్రాలలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు ఐసిడిఎస్ అధికారులు తెలిపారు. సిడిపిఒలు, సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు కేంద్రాలను పరిశీలిస్తూ, సకాలంలో పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా అందించే కోడిగుడ్లు, రాగి పిండి, చిక్కీలు, బెల్లం, నూనె, కంది పప్పు, బియ్యం, అటుకులను నేరుగా లబ్ధిదారులకు అందజేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని తయారుచేసి అందజేస్తున్నారు. ఎక్కడ కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా క్షేత్రస్థాయిలో ఐసిడిఎస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు టిఎ, డిఎలను ఇవ్వడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అంగన్వాడీ హెల్పర్లు గా పనిచేస్తున్న వారికి వర్కర్లు గా ఉద్యోగం పొందేందుకు వయో పరిమితిని 45 నుంచి 50 ఏళ్ల వరకు పెంచుతూ ఆదేశాలు ఇచ్చింది.

విజయవంతంగా ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాలు

ప్రజాశక్తి-నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ఆడుదాం ఆంధ్ర" క్రీడోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని కలెక్టర్ ఎం. హరి నారాయణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణం నుంచి కలెక్టర్ హరి నారా యణ్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, మున్సి పల్ కమిషనర్ వికాస్ హాజ ర య్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్న "ఆడుదాం ఆంధ్ర" క్రీడోత్సవాలు గ్రామ, మండల నియోజక వర్గ,జిల్లా స్థాయిలో అన్ని సచివాలయాల పరిధిలో పటిష్టంగా నిర్వహించేలా ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు .రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయా లన్నారు. క్రీడల ప్రారంభానికి 2 రోజుల ముం దుగానే అందరికీ తెలిసేలా 2కె, 3 కె రన్ పోటీలను నిర్వహించా లన్నారు. కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మి ంటన్, వాలీ బాల్ క్రీడలకు సంబంధించిన క్రీడా వస్తువుల కిట్స్ పంపిణీ సక్ర మంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కేంద్రం నిధులతోనే అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

గ్రామాలల్లో జరిగే అభివృద్ధి పనులకు వినియో గించే నిధులన్నీ కేంద్ర ప్రభుత్వానివేనని బిజెపి ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కంది మల్లికార్జునరెడ్డి అన్నారు. బుధవారం నారంపేట గ్రామంలో వికసిత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంది మల్లిఖార్జున రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ శ్రీహరి నాయుడు, నాయకులు నరసింహానాయుడు, సుధాకర్ రెడ్డి, రామసుబ్బయ్యా, సుమంత్ రెడ్డి, మస్తాన్ తదితర ప్రభుత్వ అధికారులు, ఉద్యోగస్తులు, గ్రామప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన

ప్రజాశక్తి-బిట్రగుంట

పర్యావరణ నెట్‌వర్క్ సహకారంతో అక్షయ ఉమెన్ అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్ మెంట్ అధ్యక్షురాలు జి.బాలశైలజ ఆధ్వర్యంలో బోగోలు మండలం ఎవిఎస్‌ఆర్ పేటలోని అక్షయ ఉమెన్స్ అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ది పూర్ పీపుల్స్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ చేవూరు చిన్న ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు కోసం ప్లాస్టిక్ వాడకం నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల వల్ల పర్యావరణానికి కలిగే ముప్పు అంతా ఇంతా కాదని ఆయన తెలిపారు. జెడ్‌పి బాయ్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ మనిషి రోజువారీ కార్యకలాపాలలో బ్యాగులు ముఖ్యమైన వస్తువులు, అందువల్ల వాటి నిరంతర కంటే ప్లాస్టిక్ సంచులు అధికంగా ఉపయోగిస్తున్నారని, వీటిని అరికట్టాలని ఆయన అన్నారు. సంస్థ అధ్యక్షురాలు జి.బాల శైలజ మాట్లాడుతూ జీవిత చక్రంలో పర్యావరణంపై వాటి ప్రభావాన్ని హైలెట్ చేయడానికి అందుబాటులో ఉన్న కొన్ని ప్రత్యామ్నాయాలను ఏర్పరచుకోవాలని ప్లాస్టిక్ సంచులు కాగితపు సంచులు, టోట్ బ్యాగ్‌లు, జనపనార సంచులు,ఉన్ని సంచులు అధోకరణం చెందే ప్లాస్టిక్ సంచుల రూపంలో వినియోగించాలని ఆమె తెలిపారు, కార్యక్రమంలో శ్రీనివాసులు, జి.రమణ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిన తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి-కావలి : కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆదేశానుసారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన యువగళం నవశకం బహిరంగ సభకు వెళ్లేందుకు గురువారం కావలి నుండి స్పెషల్ ట్రైన్‌లో టిడిపి శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. కావలి రైల్వే స్టేషన్‌లో "యువగళం - మనగళం", "చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గుత్తికొండ కిషోర్‌బాబు, మంచాల ప్రసాద్, నల్లమోతుల శ్రీనివాసులు, గుర్రం సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : విజయనగరం జిల్లా పోలిపల్లిలో బుధవారం జరుగుతున్న నారా లోకేష్‌బాబు యువ గళం ముగింపు విజయో త్సవ సభలో ఉదయగిరి నియోజక వర్గం టిడిపి నాయకులు తరలివెళ్లారు.

కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ వెంట సీతారామపురం మండలం తెలుగుయువత, కాకర్ల ట్రస్ట్ సభ్యులు ఎం.సుమన్, తిరుపతయ్య వెళ్లారు.

మాట్లాడుతున్న పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్

టీడీపీ అధికారంలోకి వస్తే భవిష్యత్తు మారినట్టే

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

టీడీపీ అధికారంలోకి వస్తే మన బిడ్డల భవిష్యత్తు మారినట్లేనని అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని నారాయణ మెడికల్ కాలేజీలో బుధవారం నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి 3,4,6,8,9,10 డివిజన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, గత ఎన్నికలకు నేటి ఎన్నికలకు భూమి ఆకాశానికి ఉన్న తేడా ఉందన్నారు. నేటి ఎన్నికలు పూర్తిగా కార్పొరేట్ ఎన్నికలు అయిపోయాయన్నారు. మన కర్మలను బట్టే ఫలితాలు ఉంటాయని మనం చేసే పనులను బట్టే మన భవిష్యత్తు మారబోతోందన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి ప్రజా ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు.

నాయకులతో విక్రమ్‌రెడ్డి మాటామంతి

ప్రజాశక్తి-సంగం: నెల్లూరు నుండి ఆత్మకూరు వైపు వెళ్తున్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి స్థానిక జాతీయ రహదారిపై ఉన్న కెఎం కాఫీ కేఫ్ వద్ద ఆగి సరదాగా టీ తాగి నాయకులతో ముచ్చటించారు. ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి అక్కడ ఆగుతారన్న సమాచారంతో ముందుగానే అక్కడ చేరుకున్న రైతులు కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువ కింద ఉన్న తమకు సాగునీరు అందడం లేదని ఎంఎల్ఎకు వివరించారు. రైతుల సమస్యను విన్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి వెంటనే కావాలి కాలువ ఎఇ రమణయ్యను అక్కడకి పిలిపించుకున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సాగునీటిని అందించాలని ఎఇకు సూచించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రఘునాథరెడ్డి, గాంధీజీని సంఘం సర్పంచ్ చందన్ కుమార్, నాయకులు జనార్దన్ రెడ్డి, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

నువ్వులపంట యాజమాన్యంపై అవగాహన

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలం బుడవాడ గ్రామములో కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ డి.విజయ్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత 2023-24లో భాగంగా నువ్వులలో సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నువ్వులను ఆశించు పురుగులు, తెగుళ్ల యాజమాన్య పద్ధతులు, నువ్వుల పంట యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రంలో భాగంగా 25 ఎకరాలకు 50 కేజీల వైఎల్ఎం-66 నువ్వుల విత్తనాలను, వివిధ రకాల పురుగు, తెగుళ్ల, కలుపు మందులను, వేప నూనెలను 25మందికి పంపిణీ చేశారు. వైఎల్ఎం-66 నువ్వుల రకం బూడిద, ఆకుమచ్చ తెగుళ్లను తట్టుకొనే రకం, ఎకరాకు 6 క్వింటాలు దిగుబడి వచ్చే రకం అని తెలిపారు. కార్యక్రమంలో బూడవాడ గ్రామ వ్యవసాయ అధికారి మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

'సైన్స్ ఎగ్జిబిషన్'

ప్రజాశక్తి-సంగం

సంగం జెడ్‌పి హై స్కూల్‌లో సౌత్ ఇండియన్ సైన్స్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సైన్స్ ఉపాధ్యాయులు పాఠశాల స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌ను హెడ్‌మాస్టర్ బుజ్జయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు ఎగ్జిబిషన్లను ఆయన పరిశీలించి వారిని అభినందించారు. పాఠశాలస్థాయి అనంతరం మండలస్థాయి, జిల్లాస్థాయి రాష్ట్రస్థాయిలో ఎగ్జిబిషన్లు నిర్వహించి అనంతరం సౌత్ ఇండియన్ స్థాయిలో ఈ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.